# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 18-01-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికారుల బృందం ఈ రోజు దావోస్ వెళ్లనుంది.**

2. **తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన వ్యక్తి ఎన్టీఆర్ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు.**

3. **రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.**

4. **దేశవ్యాప్తంగా ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జేఈఈ మెయిన్ పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను జాతీయ పరీక్షల సంస్థ విడుదల చేసింది.**

5. **న్యూజిలాండ్ క్రికెట్ జట్టు భారత పర్యటనలో భాగంగా ఇరు జట్ల మధ్య నిర్వహిస్తున్న మూడు వన్ డే సిరీస్‌లో చివరి మ్యాచ్ ఈ రోజు జరుగుతోంది.**

==========================

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికారుల బృందం ఈ రోజు దావోస్ వెళ్లనుంది. ఈ నెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి భేటీ అవుతారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ రాత్రికి విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్లి అక్కడి నుంచి జ్యూరిచ్ కి చేరుకుంటారు. జ్యూరిచ్‌లో పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. అనంతరం భారత ఎంబసీ ఆధ్వర్యంలో హిల్టన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి హాజరవుతారు. జ్యూరిచ్ నుంచి రోడ్డు మార్గాన దావోస్ కు వెళ్లనున్నారు.

--------------------------

తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. గుంటూరు జిల్లా మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొని నివాళులర్పించారు. రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి సంక్షేమ పథకాలు ఎన్టీఆర్ అమలు చేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తు చేస్తూ...

వాయిస్...30 సెకన్లు

---

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన పాత్రికేయుల సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజల అందరూ సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారని తెలిపారు. సాంప్రదాయ పరంగా నిర్వహించే పండుగలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సత్యప్రసాద్ తెలియజేస్తూ..

..వాయిస్.. 30 సెకన్లు

---

'హరిత ధర్మవరం – స్వచ్ఛ ధర్మవరం' లక్ష్యంగా నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ ఈరోజు ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణలో ప్రజలను భాగస్వాముల్ని చేసే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన 'ఏక్ పెడ్ మా కే నామ్ స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పౌరుడు తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా ప్రకృతితో భావోద్వేగ బంధాన్ని పెంపొందించుకోవాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు.

---

దేశవ్యాప్తంగా ఈ నెల 21వ తేదీ నుంచి జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను జాతీయ పరీక్షల సంస్థ –ఎన్.టి.ఎ. నిన్న విడుదల చేసింది. అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది. పేపర్–1, 2లకు కలిపి దేశవ్యాప్తంగా దాదాపు 14 లక్షల 50 వేల మంది ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపింది.

---

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు ఉన్నాయని తిరుపతి జిల్లా రైతులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సేంద్రీయ ఎరువులతో సహజ వ్యవసాయం చేస్తూ ఒక వైపు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ.. ఆర్థికంగా లబ్ధి పొందుతున్నామని అంటున్నారు. రాబోయే కాలంలో స్థిరమైన వ్యవసాయాన్ని అందించాలన్న ఉద్దేశంతోనే ఎరువులు, రసాయనాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయంపైనే ప్రత్యేక దృష్టి సారించామని జిల్లాకు చెందిన రైతు మాట్లాడుతూ..

..వాయిస్....27 సెకన్లు

---

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

రాష్ట్రంలోని గ్రామీణ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవం వాయిదా పడినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేసినట్లు వెల్లడించాయి. ఆయన పర్యటన ముగించుకుని వచ్చిన తరువాత క్యాంటీన్లు ప్రారంభించనున్నారని తెలిపాయి.

---------------------------

న్యూజిలాండ్ క్రికెట్ జట్టు భారత పర్యటనలో భాగంగా ఇరు జట్ల మధ్య నిర్వహిస్తున్న మూడు వన్ డే సిరీస్‌ల్లో చివరి మ్యాచ్ ఈ రోజు మధ్యప్రదేశ్ ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో జరుగుతోంది. ఇందులో భాగంగా మొదట టాస్ గెలిచిన భారత్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది.

---------------------------

రాష్ట్ర ఐఏఎస్ కేడర్ సంఖ్యను 239 నుంచి 259కి పెంచుతూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాలశాఖ నిన్న నోటిఫికేషన్ జారీచేసింది. ఇందులో సీనియర్ డ్యూటీ పోస్టులను 130 నుంచి 141కి పెంచింది. వీటిలో ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి పోస్టుల సంఖ్య 2 నుంచి 3కి చేరాయి. రాష్ట్రంలో జిల్లాల సంఖ్య పెరిగిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పోస్టులను ఇదివరకు ఉన్న 13 నుంచి 26 చేసింది. ఐటీడీఏ పీఓ, డీఆర్‌డీఏ, జడ్పీ సీఈఓ పోస్టుల సంఖ్యను 8 నుంచి 5కి, డైరెక్టర్ పోస్టుల సంఖ్యను 28 నుంచి 20కి తగ్గించింది.

---------------------------

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం జిల్లా ఇంఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారులు దాఖలు చేసిన అర్జీలు పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని చెప్పారు. ప్రజలు అర్జీలను Meekosam.ap.gov.inలో నమోదు చేసుకోవచ్చని సూచించారు.

---------------------------

సంక్రాంతి పండగ సెలవుల అనంతరం ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనదారులకు పోలీసు అధికారులు పలు సూచనలు ఇస్తున్నారు. విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు నుంచి వెళ్లే వాహనాలు కృష్ణాజిల్లాలోని చిన్న అవుటపల్లి వద్ద విజయవాడ వెస్ట్ బైపాస్ మీదగా హైదరాబాద్ కు వెళ్లాలని చెప్పారు. నెల్లూరు, ఒంగోలు నుంచి విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు వెళ్లే వాహనాలు గుంటూరు కాజ, చినకాకాని జంక్షన్ నుంచి గొల్లపూడి మీదగా వెళ్లాలని సూచించారు.

======================